సాక్షి
తిరుపతి

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,330
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,210

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,000
రిటైల్ వెండి గ్రాము	రూ.70.00

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	33	18
తిరుమల	29	13
గూడూరు	33	20
నగరి	33	19



నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నియమావళి అనుసరించి, సమావేశం నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

నేడే రథోత్సవం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించనున్నారు. అలాగే రాత్రి పట్టణంలోని నారద పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

లింగోద్భవం.. పోటెత్తిన భక్తజనం



లింగోద్భవం దర్శనానికి వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి దాటిన అనంతరం లింగోద్భవ దర్శనానికి భక్తులు పోటెత్తారు. నంది సేవ తర్వాత ఉత్సవమూర్తులు ఆలయానికి చేరిన వెంటనే ఆలయ అర్చకులు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 11 అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అంతా జాగరణ చేసి తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లును దర్శించుకునేందుకు భక్తులు వేసిఉన్నారు.

ఆనందిపరవశం!

- అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- శివ జాగరణకు పోటెత్తిన భక్తులు
- ఓంకార నాథంతో మార్మోగిన శ్రీకాళహస్తి పరిసరాలు
- నంది వాహనంపై ఊరేగుతూ కనువిందు చేసిన స్వామి, అమ్మవార్లు

తొట్టంబేడు(శ్రీకాళహస్తిరూరల్)/శ్రీకాళహస్తి: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం రాత్రి అధికార నందిపై ముక్కంటీశుడు పురవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. స్వర్ణాభరణాలతో అలంకరించిన స్వామివారి దేవేరి జ్ఞానప్రసూనాంబిక పరాక్రమాలకు ప్రతీక అయిన సింహ వాహనంపై ఊరేగారు. తిరుమల వెంకన్న బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవకు ఎంత విశిష్ట ఉందో శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే నంది సేవకు అంత ప్రాముఖ్యత ఉంది. అందుకు కారణం.. ధర్మానికి ప్రతీకలైన నంది పాదాలు కావడం ఒక విశేషం. అలాగే శ్రీకాళహస్తీశ్వరుని నమ్మిన బంటుగా నంది ఉండడం మరో కారణం. నంది అనుమతితో స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో స్వామివారు నంది వాహనంపై ఊరేగుతున్న నీలకంఠుడిని భక్తజనం దర్శించుకుని తరించారు. అలాగే అమ్మవారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. సింహ, నంది వాహనాలు స్వరూపరీత్యా వైరుధ్యాన్ని కలిగి ఉన్నప్పటికి బ్రహ్మోత్సవాల్లో ఈ రెండు వాహనాలు స్వామి, అమ్మవార్లతో కలిసి పుర ప్రదర్శనకు రావడం విశేషం. కేరళ పంచ వాయిద్యాలు, భక్తి సంకీర్తనలు, భజనలు, కోలాట ప్రదర్శనలు అలరించాయి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.



నిర్మలా నృత్యానికేతన్ వారి నృత్య ప్రదర్శన



చిన్నారి హర్షితా సూర్యకుమార్ నృత్యం





నంది వాహనంపై ఊరేగుతున్న ముక్కంటీశుడు (ఇన్‌సెట్) సింహవాహనంపై అమ్మవారు

యూపీఎస్సీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌కు రెండు పరీక్ష కేంద్రాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ కనకనరసారెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతిలో ఆదివారం జరిగే యూపీఎస్సీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 2023 పరీక్షలకు రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీఓ వీ.కనకనరసారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై కస్టోడినిగా వ్యవహరిస్తున్న ఆర్డీఓ, యూపీఎస్సీ అండర్ సెక్రటరీ బీకే సింగ్‌తో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ ఏ, వింగ్ బీ రెండు కేంద్రాలలో పరీక్షలుంటాయన్నారు. మొత్తం 822 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, పరీక్ష సమయానికి 10 నిముషాల ముందే ప్రధాన గేట్లు మూసివేస్తారని తెలిపారు. ఉదయం 10–12 గంటల వరకు, మధ్యాహ్నం 2–5 వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలుంటాయన్నారు. సమీక్షలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శివాలయాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని అన్ని ప్రముఖ శివాలయాలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేసినట్టు తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు తెలిపారు. ప్రధానంగా శ్రీకాళహస్తి, తలకోన, గుడిమల్లా నికి రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు తిరుపతి బస్టాండ్‌లో ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నగల దుకాణంలో నగదు చోరీ

గుడిపాల: మండలకేంద్రంలోని మురుగన్ నగల దుకాణం లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. శనివారం యజమాని దుకాణం తెరిచేందుకు వెళ్లగా షట్టర్ తెరచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి సీసీ పుటేజీలను పరిశీలించారు. ముగ్గురు వ్యక్తులు దుకాణం లోపలకు వచ్చి రూ.10 వేలు నగదు తీసుకున్నట్లు గుర్తించారు. నగలు అన్నీ లాకర్‌లో ఉండడంతో చోరీ చేసేందుకు వీలుకాలేదు. తరువాత షాపులో ఉన్న సీసీటీవీని తీసుకెళ్లిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా... మా కక్షిదారులైన **మెసర్స్ ఆర్.ఆర్. బిల్డర్స్ రిజిష్టర్ నెం. 212/2011 భాగస్వాములు అయిన టువంటి (1) బి.రమణారెడ్డి, (2) టి.పద్మాకర్ రెడ్డి (3) ఎస్.రాజమౌలాల్ రెడ్డి, (4) ఎస్.సుబ్బరాయుడు,** వార్ల తరపున జారీ చేయు హెచ్చరిక.

మా కక్షిదారులు మెసర్స్ ఆర్.ఆర్. బిల్డర్స్ వారు ప్రతివాదులైన **(1) ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి (NRI), (2) ఎం.రామసుబ్బారెడ్డి (హైదరాబాద్) (3) పి.వెంకట రామ మునిరెడ్డి అలియాస్ వెంకట్ (పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్, అమరావతి)** మరియు వారి కుటుంబ సభ్యులపై తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు ఓ.ఎస్. నెం.77/2022 ద్వారా రూ.9,22,67,612/-లు మరియు వడ్డీ, ఖర్చులకు గాను దాఖలపరచియున్నారు. తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టువారు తేది. 30.08.2022న క్రింద కనబరచి ఎ-షెడ్యూలు ఆస్థిపై ఐ.ఎ.నెం.168/2022 ప్రకారము ఖండిషన్ అటాచ్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చివున్నారు. ప్రతివాదులైన ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి వగైరాలు కోర్టు ఉత్తర్వులు ప్రకారము 72 గం॥లలో సరైన పూచీకత్తులను సమర్పించలేదు. కావున ఈ తేదీన కూడా కండిషనల్ అటాచ్‌మెంట్ అమలులో వున్నది. ముదిరెడ్డి రామసుబ్బారెడ్డి, ఐ.ఎ.నెం.190/2022 పిటిషన్ దాఖలు పరచి తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆస్థిని సమర్పించిన - కాని, కోర్టువారు వాటిని పరిగణంలోనికి తీసుకొనలేదు. ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి భాగస్తురాలైన ఎస్.సరోజమ్మ, భర్త ఎస్.శివశంకర్ రెడ్డి, కర్నూలు వారు ఐ.ఎ.నెం.189/2022 పిటిషన్ దాఖలుపరచి వున్నారు - దాని ప్రాకరము వారి ఎ.2-01 సెంట్లు సర్వే నెం.265, కండిషన్ అటాచ్‌మెంట్ నుండి తొలగించమని కోరియున్నారు. కాని, కోర్టువారు ఇప్పటివరకు ఆమోదించలేదు. ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి / ఎం.రామసుబ్బారెడ్డి వార్లు గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, అమరావతిని CRP No: 2530/2022, తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారి కండిషన్ అటాచ్‌మెంట్ ఉత్తర్వులకు రివిజన్ దాఖలుపరచివున్నారు. - కాని, వారికి గౌరవ ఏపి హైకోర్టు వారు ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి / ఎం.రామసుబ్బారెడ్డి వార్లు గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నందు W.P.No.: 38511/2022 గవర్నమెంట్ ఆఫ్ ఏపి, డిస్ట్రిక్ట్ కలెక్టర్, తిరుపతి వగైరాలపై దాఖలు చేసివున్నారు - వారికి ఎటువంటి ఉత్తర్వులు జారీ చేసి వుండలేదు. తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జికోర్టు ఉత్తర్వులు తేది. 30.08.2022 ఐ.ఎ.నెం.168/2022 పరిగణంలోనికి తీసుకొని రేణిగుంట సబ్ - రిజిస్ట్రారు వారు షెడ్యూలు దాఖలా ఆస్థిపై రిజిస్ట్రేషన్ నిషేధించి వున్నారు. ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి / ఎం.రామసుబ్బారెడ్డి / వెంకట్ వగైరాలు వారికి అమరావతిలో పలుకుబడి వున్నదని మరియు ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ & స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ వారికి తప్పుడు సమాచారం ఇచ్చి మరియు తప్పుడు సూచనలు చేసి తిరుపతి స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్ వారి లీగల్ ఒపీనియన్ అనే నెపంతో కోర్టు ఉత్తర్వులను ధిక్కరణ చేసి తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేయుటకు పాల్పడుతున్నారు.

గౌరవ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను క్లారిఫికేషన్ కోర్టు ద్వారా పొందవలసి వున్ననూ, పలుకుబడితో మరియు తప్పుడు సమాచారంతో స్పెషల్ జిపి లీగల్ ఒపీనియన్ ద్వారా కోర్టు ధిక్కరణ పాల్పడ్డ అనధికారులు మరియు అధికారులు చట్టరీత్యా శిక్షార్హులు మరియు తేది. 30.08.2022 తదుపరి ఎటువంటి రిజిస్ట్రేషన్లు చట్టరీత్యా చెల్లవు. ఈ ప్రకటన ద్వారా ప్రజలపై అనధికారులు మరియు అధికారులు ద్వారా పై షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎటువంటి క్రయ విక్రయాలను జరపరాదని తీవ్రంగా హెచ్చరించడమైనది.

SCHEDULE-A: Chittoor District Sri Balaji Registration District, Tirupati - Renigunta Sub-District Renigunta Mandalam Mangalam group - Venkatapuram village accounts - Government Dry Survey No. Sale extent Ac. - cents Hectors, 265/1B2 0-09 0.036, 265/2B2 0-14 0.056, 265/3B 0- 29 0.117, 265/4B 0-15 0.060, 265/5B 0-43 0.174, 265/6B 0-31 0.125, 265/78 0.14 0.056, 265/1B1 0-09 0.036, 265/2B1 0-13 0.052, 265/3A 0-30 0.121.265/4A 0-15 0.060, 265/5A 0-44 0.178, 265/6A 0-32 0.125, 265/7A 0-14 0.056, 265/8A 0-13 0.052, 265/9 0-13 0.052, 265/10B 0-48 0.194. 265/11 0-15 0.060 Total Ac. 4-01 cents 1.624 to the said land bounded on the **East**: Kuditi Pushpavathi. Chengalrayulu land, **West**: Venkatapuram tank. **North**: Tirupati to Karakam badi road, **South**: Venkatapuram tank. In between Ac.4-01 cents or 1.624 hectors land. Patta No.71, Title deed No. K274841 with ownership rights.

మెసర్స్ ఆర్.ఆర్. బిల్డర్స్
(1) బి.రమణారెడ్డి (2) టి.పద్మాకర్ రెడ్డి
(3) ఎస్.రాజమౌలాల్ రెడ్డి (4) ఎస్.సుబ్బరాయుడు

మట్టా పురుషోత్తమ రెడ్డి,
న్యాయవాది, తిరుపతి

అగస్తీశ్వరస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి


పుంగనూరు : నెక్కుందిలో భవన నిర్మాణ పనులపై చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పుంగనూరు మండలంలోని నెక్కుందిలో వెలసిన అగస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఆలయానికి రాగానే ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణరెడ్డి, బోయకొండ చైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, వేదపండితులతో కలసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ పరిధిలో జరుగుతున్న పుష్కరిణి పనులను, కల్యాణ మండపం, విశ్రాంతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, చౌడేపల్లె జెడ్పీటీసీ దామోదర్‌రాజు, సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


అగస్తీశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి

అయ్యప్పస్వామి సేవలో మంత్రి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, నాగమల్లేశ్వరస్వామికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగల అరెస్ట్

- 20 బైక్‌లు స్వాధీనం


దొంగల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు అర్బన్: బైక్ కనబడితే చాలు రెప్పపాటు కాలంలో ఎత్తుకెళ్లే ఓ ముఠాను చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు చాకచక్యంగా పటుకున్నారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి శనివారం ముఠా అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. ఇటీవల చిత్తూరు నగరంలో పలు బైక్‌లు చోరీ కావడంతో పలువురు బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు తమిళనాడులోని గుడియాత్తం తాలూక ఏరికుత్తి గ్రామానికి చెందిన ప్రకాష్ (30), శరవణమూర్తి(44)ని శుక్రవారం పీవీకేన్ కళాశాల సమీపంలో పట్టుకున్నారు. చోరీ చేసిన వాహనాలను వీరు తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో విక్రయించినట్లు విచారణలో తేలింది. మరికొన్నింటిని ముళ్ల పొదల్లో పడేసినట్లు గుర్తించారు. రూ.15 లక్షలు విలువ చేసే 20 బైకుల ను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరి కొంతమంది ఉన్నారని, పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలపై తమిళనాడులోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం ఈ కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన రివార్డులతో అభినందించారు. ఎస్ఐలు రమేష్ బాబు, వసంత, ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

యువకుడి సజీవదహనం

పుంగనూరు: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంలో మంటలు రావడంతో వాహనచోదకుడు సజీవదహనమైన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పలమనేరు పట్టణంలోని ముత్తాచారిపాళ్యెంలో నివాసం ఉన్న అంజాద్‌బాషా కుమారుడు ఆదిల్‌బాషా (19) ద్విచక్రవాహనంపై మదనపల్లె నుంచి పలమనేరు వెళ్తుండగా.. పుంగనూరులోని అరబిక్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనం కిందపడి మంటలు చెలరేగాయి. వాహనాన్ని నడుపుతున్న ఆదిల్‌బాషా అక్కడికక్కడే మంటల్లో కాలి మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిక్షాలో మంత్రి రోజా ప్రయాణం


వారణాసిలో రిక్షాలో ప్రయాణిస్తున్న మంత్రి రోజా

నగరి : పవిత్ర పుణ్య క్షేత్రం వారణాశిలో కాశీవిశ్వేశ్వరుడి దర్శనం కోసం ఆర్‌కే రోజా వెళ్లారు. అయితే వారణాశిలోని వీధుల్లో మంత్రి రోజా రిక్షాలో తిరుగుతూ సందడి చేశారు. 144 ఏళ్ల తరువాత శనిత్రయోదశి నాడు మహాశివరాత్రి రావడంతో ఈ పర్వదినాన కాశీవిశ్వేశ్వరుని శనివారం ఆమె దర్శించుకున్నారు. గంగా హారతి అనంతరం తానో మంత్రి, సెలబ్రిటీ అని మరచి కాసేపు ఓ సాధారణ భక్తురాలిలా రిక్షాలో ప్రయాణించారు.

పెయింట్ దుకాణం దగ్ధం

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న ఓ పెయింట్ షాపులో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో సిబ్బంది స్టాకును సిబ్బంది సర్దుతుండగా అందులోని ఓ టిన్నర్ లీక్ అయింది. దీనిపై పక్కనే ఉన్న మంచినూనె దీపం పడి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపుచేసింది. అయితే పెయింట్స్ కావడంతో వేగంగా మంటలు వ్యాప్తి చెంది దుకాణం మొత్తం వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 లక్షల నష్టం వాటిల్లినట్టు దుకాణ యజమాని జగదీష్ తెలిపారు.

క్లుప్తంగా

రైలు కిందపడి యువకుడి మృతి


సునీల్ మృతదేహం

వెంకటగిరి: పట్టణంలోని రైల్వేగేట్ సమీపంలో వెంకటగిరి పట్టణం, కాలేజీ మిట్టకు చెందిన టీ సునీల్ (37) రైలు కిందపడి మృతిచెందాడు. అతనిది ఆత్మహత్యా లేక ప్రమాదవశాత్తు పడిపోయాడా విచారణలో తేలుతుందని గూడూరు రైల్వే ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

ఇసుక టాక్టర్ స్వాధీనం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పెద్దకనపర్తి సమీపంలోని స్వర్ణముఖినది నుంచి అనాధికారంగా శ్రీకాళహస్తికి ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాఘువేంద్ర తెలిపారు. ట్రాక్టర్‌కు సంబంధించి ఆదినారాయణ అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

చెరువులో పడి యువకుడి మృతి

– పండుగపూట కురింజల్లంలో విషాదం


ప్రకాష్ (ఫైల్)

వరదయ్యపాళెం: గొర్రెలను కడిగేందుకు చెరువు వద్దకు వెళ్లిన యువకుడు కాలు జారిపడి చెరువులో మునిగి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని కురింజల్లంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురింజల్లంకు చెందిన ఆనందయ్య కుమారుడు ప్రకాష్ (24) శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. సెలవు కారణంగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు గొర్రెలను కడిగేందుకు తీసుకెళ్లాడు. గొర్రెలను చెరువు వద్ద దించి కడుగుతుండగా కాలు జారి చెరువులోకి జారిపోయాడు. ఈత రాని ప్రకాష్ నీటిలో మునిగి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. కుటుంబ పోషణకు దిక్కైన కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన స్థానికులను సైతం కలచి వేసింది.

యంత్రమేవ ప్రాప్తిరస్తు

ఒకప్పుడు ధనికుల వద్దే ట్రాక్టర్లు ఉండేవి. డబ్బున్న వారి వద్దే ఆధునిక వ్యవసాయ పరికరాలు ఉండేవి. బాగా ఉన్నతంగా ఉండేవారి వద్దే వరికోత లాంటి యంత్రాలు ఉండేవి. కానీ ఇప్పుడు అలాకాదు.. ప్రతిరైతూ సంతోషంగా ఉండాలి.. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సాగు చేసుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే వైఎస్సార్ యంత్రసేవా పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా ఇప్పటికే మొదటి విడతలో ట్రాక్టర్లు, వివిధ వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసింది. ఇప్పుడు రెండో దశలో మరింత మందికి వెన్నుదన్నుగా నిలిచేందుకు సిద్ధమైంది. ఈ మేరకు యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. దీనిపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- అన్నదాతకు అండగా వైఎస్సార్ యంత్రసేవా పథకం
- 28న రెండో విడత ట్రాక్టర్ల పంపిణీ
- 40 శాతం రాయితీతో ట్రాక్టర్లు, పనిముట్లు
- ఆర్బీకేల్లో ముమ్మరంగా సీహెచ్‌సీ గ్రూపుల ఏర్పాటు


వైఎస్సార్ యంత్రసేవా పథకం పనిముట్లు


వైఎస్సార్ యంత్రసేవా పథకం ట్రాక్టర్లు (ఫైల్)

జిల్లా సమాచారం

సాగు విస్తీర్ణం	-	6.5 లక్షల ఎకరాలు
రైతులు	-	2.45 లక్షల మంది
కౌలు రైతులు	-	55 వేల మంది
తొలి దశలో	-	180 సీహెచ్‌సీ గ్రూపులు
రెండో దశలో	-	137 సీహెచ్‌సీ గ్రూపులు
ఆర్బీకేలు	-	445
ట్రాక్టర్ విలువ	-	రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు
సబ్సిడీ మొత్తం	-	రూ. 40శాతం

తిరుపతి అర్బన్: రైతును రాజును చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా అన్నదాతకు అనేక పథకాలు అందిస్తోంది. ఇంటి ముంగిటకే రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చింది. విత్తనాల నుంచి పురుగు మందులు.. ధాన్యం సేకరణ వరకు అక్కడే విక్రయిస్తూ.. నిర్వహిస్తూ తోడుగా నిలుస్తోంది. అంతేగాక సాగును సులభతరం చేయాలనే ఉద్దేశంతో రైతుకు అవసరమైన పనిముట్లు, యంత్రాలను సబ్సిడీ ద్వారా అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందిస్తోంది.

తొలివిడతలో 180 ట్రాక్టర్లు.. 86 పనిముట్లు పంపిణీ

తొలి విడతలో వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద 2022 జూన్ 7వ తేదీన జిల్లాలో 180 మంది రైతులకు 40 శాతం సబ్సిడీతో అధికారులు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. మరో 86 వ్యవసాయ పనిముట్లను అందజేశారు. యూనిట్ కాస్ట్ రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వివిధ పనిముట్లను ఈ పథకం ద్వారా అందిస్తున్నారు.

రెండో దశకు గ్రీన్ సిగ్నల్

రెండో విడతతో ట్రాక్టర్ల పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని 137 సీహెచ్‌సీ (కస్టమ్ హైరింగ్ కేంద్రాలు) గ్రూపులకు ట్రాక్టర్లు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. అలాగే పవర్ టిల్లర్లు, దిక్కుసెట్లు, దమ్ముసెట్లు, స్ప్రేయర్లు, రొటావేటర్లు తదితర 50 రకాల వ్యవసాయ పనిముట్లు అందజేయనుంది. ఇందులో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇవ్వగా.. 10 శాతం రైతులు చెల్లిస్తే సరిపోతుంది. 50 శాతం రైతులు విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుంది.

137 సీహెచ్‌సీ గ్రూపుల ఏర్పాటు

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల నేతృత్వంలో సీ హెచ్‌సీ (కస్టమ్ హైరింగ్ కేంద్రాలు) గ్రూపులు ఈనె ల పదో తేదీతో పూర్తయ్యాయి. మొత్తం 137 గ్రూపులను ఏర్పాటు చేశారు. ఆయా గ్రూపులకు చెందిన వారు తమ బ్యాంక్ ఖాతాలో యూనిట్ కాస్ట్‌లో 10 శాతం డిపాజిట్ చేశారు. వారికి ఈనెల 28న యంత్రాలు పంపిణీ చేయనున్నారు.

ఎవరి సిఫార్సు అవసరం లేదు



వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ట్రాక్టర్లతోపాటు వివిధ పనిముట్లను 40 శాతం రాయితీతో పొందడానికి ఎవరి సిఫార్సు అవసరం లేదు. సీహెచ్‌సీ గ్రూపుల్లో సభ్యులుగా ఉంటేచాలు. ఈ పథకం ద్వారా ఇచ్చే అన్ని పనిముట్లు పొందవచ్చు. ఈ మేరకు గ్రూపులు సిద్ధంశాం. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

యంత్రసేవా పథకంతో ఎంతో ప్రయోజనం



వైఎస్సార్ యంత్రసేవా పథకం రైతులకు వరం. రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు చేసి ట్రాక్టర్, వరికోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు సాధ్యం కాదు. అయితే ఈ పథకం ద్వారా రైతులు సీహెచ్‌సీ గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి 40 శాతం రాయితీలో ట్రాక్టర్లు పొందుతున్నారు. గ్రామాల్లో నామమాత్రపు ధరలకు ట్రాక్టర్‌ను అద్దెకు పంపుతున్నారు. వచ్చిన ఆదాయాన్ని విడితల వారీగా బ్యాంక్ రుణాన్ని తీర్చుతున్నారు. చాలా సంతోసంగా ఉంది.

– మునికుమార్, పల్లం గ్రామం, ఏర్పేడు మండలం, రైతు

కారును ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

– ఒకరి మృతి, మరో నలుగురికి గాయాలు


నుజ్జునుజ్జు అయిన కారు

చంద్రగిరి: ఎదురుగా వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం సమీపంలో శనివారం తెల్లవారిజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల వివరాలు.. పాండిచ్చేరికి చెందిన భక్తులు తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో శుక్రవారం అర్ధరాత్రిలో బయల్దేరారు. శనివారం తెల్లవారుజామున పనపాకం వద్ద వస్తున్న క్రమంలో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుకు అడ్డంగా పడింది. వెంటనే వెనుక వస్తున్న మరో కర్ణాటక ఆర్టీసీ బస్సు బోల్తా పడిన కారును ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్(43) అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ప్రయాణిస్తున్న రాజన్, పెరుమాళ్, సంజిత, విజయ్‌శేఖర్ గాయపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

మార్చి 21 వరకు స్పందన రద్దు

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 21వ తేదీ వరకు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్న మైన కారణంగా స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు వెల్లడించారు. తిరిగి మార్చి 27వ తేదీ సోమవారం నుంచి యథావిధిగా స్పందన కార్యక్రమం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా టాపర్ దీపిక


దీపిక

నారాయణవనం: ఎడ్యుకేషనల్ ఏపీఫని సంస్థ నిర్వహించిన మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ)లో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థిని దీపిక జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈమేరకు శనివారం హెచ్ఎం శశికల మీడియాతో మాట్లాడారు. విద్యార్థినికి రూ.8 వేల నగదుతో పాటు సర్టిఫికెట్, ట్రోఫీ, విద్యావిషయ కిట్‌ను సంస్థ అందజేస్తుందని తెలిపారు.

నేడు ఎస్ఐ పరీక్షలు

- 12,799 మంది దరఖాస్తు
- 21 కేంద్రాల్లో పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు నో ఎంట్రీ

పరీక్షలు ఇలా..

- మొదటి పేపర్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు
- రెండో పేపర్ 2.30 నుంచి 5.30 వరకు జరగనుంది.
- పరీక్ష కేంద్రాల్లోకి 9 గంటల నుంచి అనుమతించునున్నారు.
- నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతి నిరాకరణ

తిరుపతి క్రైం: పోలీస్‌శాఖ నిర్వహించే ఎస్ఐ పోస్టుల ప్రాథమిక రాత పరీక్ష మరికొన్ని గంటల్లో జరగనున్నాయి. గత ఏడాది నవంబర్లో రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు భర్తీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే కానిస్టేబుల్ పరీక్షలు ముగిశాయి. ఆదివారం ఉదయం ఎస్ఐ పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం 12,799 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే.. తదుపరి పరీక్షలకు అర్హత పొందుతారు. ఇందుకోసం 21 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. ఇక్కడ ఏర్పాట్లు అన్నీ కూడా పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఇప్పటికే 144 సెక్షన్ ఐపీసీని అమలు చేస్తున్నారు. ప్రతి కేంద్ర వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రతిక్షణం పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ మొదలగు ప్రాంతాల్లో పోలీసులు అభ్యర్థులకు సౌలభ్యం కోసం 7 గంటల నుండి 8.45 నిమిషాల వరకు పోలీస్ వాహనాల ద్వారా పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను చేర్చనున్నారు.

గ్రీన్‌టెక్ పరిశ్రమలో వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన మహేష్‌బాబు, మహేష్‌బాబు (ఫైల్)

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని కోనేటిరాజుపాళెం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న విభూది మహేష్‌బాబు(28) అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలు.. దొరవారి సత్రం మండలం, నెల్లబల్లి గ్రామానికి చెందిన విభూది మహేష్‌బాబు గ్రీన్‌టెక్ పరిశ్రమలో మిషనరీ సెక్షన్‌లో ఆపరేటర్‌గా పనిచేపస్తున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా వీధులకు వెళ్లగా.. ఆ తర్వాత ఫిట్స్ వచ్చిపడిపోవడంతో మహేష్‌బాబు తమ్ముడు సాయితేజ్ హుటాహుటిన నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ కొంతసేపటికే మహేష్‌బాబు మృతిచెందాడు. ఈ క్రమంలో మహేష్‌బాబు మృతిపై అనుమానం ఉందని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

'వడ్డించేవాడు మనవాడైతే ఏ మూలన కూర్చుంటే ఏముందిలే' అన్న చందాన మనకు అనుకూలంగా ఉన్న అధికారుల చేతుల్లో కాసులు పడితే ఏ రికార్డులను అయినా మార్చేయగలరు.. ఏమైనా చేయగలరు' అనేలా ఉంది కొందరి అధికారుల తీరు. అందుకు పలమనేరులో నిమ్నజాతి పట్టాల భూముల్లో కమర్షియల్ భవనాలు వెలుస్తున్న తీరే నిదర్శనం. బ్రిటీష్ వారి పాలనలో నిమ్నజాతి(ఎస్సీ) వారికి ఇచ్చిన కండీషన్ పట్టా భూముల్లో వారే వ్యవసాయం చేసుకోవాలన్న నిబంధనను పక్కన పెట్టి రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల్లో కొందరు అధికారులు అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పలమనేరు ఆర్డీఓ కార్యాలయ సమీపంలో నిమ్నజాతి పట్టాల్లో నిర్మిస్తున్న భవనాలు

కండీషన్లు పక్కన పెట్టి..

- అక్రమార్కుల చేతుల్లోకి నిమ్నజాతి పట్టాల భూములు
- వ్యవసాయం చేయాల్సిన భూముల్లో కమర్షియల్ భవనాలు
- కండీషన్ పట్టా భూములను కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న రియల్టర్లు
- నిబంధనలకు నీళ్లొదిలిన రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులు

పలమనేరు: మనదేశాన్ని బ్రిటీష్‌వారు పాలించే సమయంలో 1914 నుంచి 1920 ప్రాంతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాటి నార్త్ ఆర్కాట్ జిల్లాలో నాలుగువేల ఎకరాల దాకా నిమ్నజాతి పట్టాలను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నిమ్నజాతి(ఎస్సీ)వారికి మంజూరు చేసింది. వీటితో పాటే తోటి ఇనాంలు, నీరుగట్టి ఇనాం పట్టాలను సైతం ఇచ్చారు. వీటి వివరాలను ఏ-రిజిస్టర్(రీసర్వే సెటిల్‌మెంట్ డైగ్లాట్)లో నమోదు చేశారు. ఇప్పటికీ బ్రిటీషువారి రికార్డులే అమలవుతున్నాయి. ఈ భూముల్లో వ్యవసాయం తప్పా ఎటువంటి వాణిజ్యపరమైన భవనాలు నిర్మించడం గానీ, వ్యాపారాలు చేయడం గానీ నిషిద్ధం. నాలుగువేల ఎకరాలను 2700 మంది ఎస్సీ రైతులకు అప్పట్లో పట్టాలుగా ఇచ్చారు. ఒకవేల నిమ్నజాతి పట్టాపొందిన వారికి వారసులు లేకుంటే ప్రభుత్వం ఆ భూమిని రెజ్యూమ్ చేసుకుని మళ్లీ భూమిలేని ఎస్సీలకు మాత్రమే పట్టాలను మార్పు చేయాల్సి ఉంటుంది.

నిబంధనలకు నీళ్లు..

జిల్లాలోని పలు పట్టణాలకు సమీపంలోని నిమ్నజాతి పట్టాలు కలిగిన భూములు ప్రస్తుతం ఎకరా కోట్లలో పలుకుతోంది. ఇలా ఉండగా కండీషన్ పట్టాలున్న కొందరు ఎస్సీలు ఈ భూములను ఇతరులకు విక్రయించారు. రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉన్నా, జీఓ నెం.22(ఏ)లో నిమ్నజాతి పట్టా సర్వేనంబర్లు లేవనే సాకుతో ఇప్పటికే జిల్లాలో పలు నిమ్నజాతి పట్టాలకు సంబంధించి క్రయవిక్రయాలు జరిగాయి. సబ్‌రిజిస్ట్రార్లు సైతం ఇదే రీజన్‌తో రిజిస్ట్రేషన్లు చేశారు. వీటిని పొందిన ఎస్సీయేతరులు ఆ భూముల్లో వెంచర్లు వేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కోట్లు సంపాదించుకున్నారు. మరికొందరు వందేళ్ల లీజుకు అన్‌రిజిస్టర్డ్ డాక్యుమెంట్లతో ఈ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఇవి చెల్లనప్పటికీ క్రయవిక్రయాలు మాత్రం అన్‌రిజిస్టర్డ్ అగ్రిమెంట్ల ద్వారా అనధికారికంగానే సాగుతున్నాయి.

ఇదిగో సాక్ష్యం..

పలమనేరు పట్టణంలోని చెన్నై-బెంగళూరు హైవేకి ఆనుకుని కోర్టు, ఆర్డీఓ, రెవెన్యూ కార్యాలయాల వద్ద చాలా భూములకు సంబంధించి నిమ్నజాతి పట్టాలున్నాయి. అయితే ఎస్సీలు కాని వారు ఆ భూముల్లో పక్కా భవనాలను నిర్మించేశారు. ఇప్పటికీ కొత్త నిర్మాణాలు సైతం సాగుతున్నాయి. అయితే ఎస్సీలు కాని వారికి ఈ భూములు ఎలా ట్రాన్స్‌ఫర్ అయ్యాయో రెవెన్యూశాఖకే తెలియాల్సి ఉంది. దానికితోడు అధికారులు ల్యాండ్ కన్వర్షన్ ఎలా చేశారో అంతుచిక్కడం లేదు. కండీషన్ పట్టా భూముల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారనేది మరో ప్రశ్న. ఈ నిర్మాణాలు జరుగుతున్న కండీషన్ పట్టాల భూములన్నీ కూడా సాక్షాత్తు ఆర్డీఓ, తహసీల్దార్, కోర్టుల ముందే ఉండడం కొసమెరుపు. ఇలాంటి అక్రమాలు పలమనేరులోనే కాదు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, కుప్పం, పలమనేరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పుత్తూరు, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోనూ జరిగినట్టు తెలుస్తోంది. నిమ్నజాతి పట్టాలు ఇతరులకు ఎలా బదిలీ అయ్యాయనే విషయంపై జిల్లా కలెక్టర్ విచారణ చేపడితే అక్రమాలు బయటపడడం ఖాయం.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 19 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 65,633 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,352 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.3.68 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 19 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ శ్యాంసుందర్



తిరుమల ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఇంద్రునిపై విహరించిన సాంబశివుడు



ఇంద్ర విమానంపై స్వామి



చప్పరంపై అమ్మవారు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): దేవతలకు అధిపతిగా ఉన్న ఇంద్రుని విమానంపై పరమేశ్వరుడు పురవిహారం చేశాడు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామి ఇంద్ర విమానంపై ఊరేగగా, అమ్మవారు చప్పరంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాల్లో ఐదో రోజు ఇంద్రుడు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం వల్ల ఆయన వాహనంపై స్వామి వారు ఊరేగడం సంప్రదాయంగా వస్తోంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా సాంస్కృతిక ప్రదర్శనలు



గాత్ర కచ్చేరీలో డాక్టర్ వందన బృందం

తిరుపతి కల్చరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం శ్రీకపిలేశ్వరస్వామి ఆలయం వద్ద నిరంతరాయంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి పారవశంతో పులకింపజేశాయి. హిందూ ధర్మప్రచార పరిషత్, ఎస్వీ సంగీత కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్విరామంగా సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి. సంగీత కళాశాల అధ్యాపకులు డాక్టర్ వందన సుమధురంగా గానం చేసి భక్తుల హృదయాలను రంజింపజేశారు. దీనికి ముందు విజయలక్ష్మి ఆలపించిన భక్తమార్కండేయ హరికథ పారాయణం, తర్వాత రామకోటేశ్వరరావు హరికథగానం ఆకట్టుకుంది. అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రేవతి బృందం గాత్ర సంగీతం, టీటీడీ పురాణ పండితులు శేషసాయిబాబు శివ పురాణ ప్రవచనం భక్తులను అలరింపజేసింది. సాయంత్రం ఎస్వీ సంగీత కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన వాయిద్య సంగీత విన్యాసం అబ్బుర పరిచింది. రాత్రి జగదీష్ బృందం, నృత్యప్రదర్శన, ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకుడు సురేష్‌బాబు బృందం శివోహం భజన కార్యక్రమం ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత కళాశాల ప్రత్యేకాధికారి శేష శైలేంద్ర, ప్రిన్సిపల్ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.



వాహన సేవలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు



శ్రీకాళహస్తిలో శివరాత్రి కోలాహలం (ఇన్‌సెట్) శంఖం పూరిస్తున్న భక్తురాలు

హర హర శంభు.. శివ మహాదేవ!

శంభోశంకర.. హరహర మహదేవ నామస్మరతో ఉమ్మడి జిల్లా మార్మోగింది. శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తగణం ఆలయాలకు పోటెత్తింది. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో ఓంకార నాథం ప్రతిధ్వనించింది. భోళాశంకరుడి ప్రతిరూపాన్ని దర్శించి మొక్కులు తీర్చుకుంది. విభూధీశుడి తిరునామాన్ని నుదుటన దిద్ది పులకించింది. పార్వతీ, పరమేశ్వరుల దివ్యమంగళరూపాన్ని దర్శించి పరవశించింది. ఉదయం నుంచే శివాలయాలన్నీ భక్తులతో నిండిపోవడంతో అధికారయంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- శ్రీకాళహస్తి, సురుటుపల్లికి పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న ప్రత్యేక ఫల,పుష్పాలంకరణలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా శివరాత్రి వేడుకలు



వాహన సేవల ముందు సాంస్కృతిక ప్రదర్శన

సాక్షి, తిరుపతి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ.. శంభోశంకర నామస్మరణతో మార్మోగాయి.

శివరాత్రి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు

శివరాత్రిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేకువజామున గోపూజతో ఆలయాన్ని తెరిచి షోడచోపచారాలు నిర్వహించి స్వామి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9గంటల ప్రాంతంలో స్వామి, అమ్మవార్లను పంచమూర్తులుగా అలంకరించి శివగోపురం ద్వారా మాడ వీధుల్లోకి తీసుకొచ్చారు. కళాబృందాల ప్రదర్శనల మధ్య స్వామి, అమ్మవార్లు, భక్త కన్నప్ప, కుమారస్వామి, వినాయకుడు ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి నంది సేవ ముగిసేవరకు స్వామి, అమ్మవార్లకు తొమ్మిదిసార్లు అభిషేకాలు నిర్వహించారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి గరుడసేవ ఎంత ప్రాశస్త్యమో.. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శివయ్యకు నంది సేవ అంతే ప్రాశస్త్యం. అందుకే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు రాత్రి జాగరణచేసి నంది సేవలో పాల్గొని శివయ్యను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిరుపతి కపిలతీర్థంలోని శివాలయానికి భక్తులు పోటెత్తారు. నాగలాపురం మండలం సురుటుపల్లిలోని శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయానికి ఏపీ, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తలకోనలోని సిద్ధేశ్వరుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులిచర్ల మండలం, రెడ్డివారిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి, దేవళంపేటలోని శ్రీకాశీవిశ్వేశ్వరుడు, సోమల మండలం, దుర్గంకొండలో కొలువైన శ్రీగార్గేయ మునీశ్వరస్వామి, పుంగనూరు మండలం, నెక్కుందిలోని ఆగస్తీశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పుత్తూరు సమీపంలోని సదాశివకోన భక్తులతో కిక్కిరిసింది. బంగారుపాళెం మండలం, మొగిలిలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే మహాసముద్రం గ్రామంలో వెలసిన బృహదీశ్వరాలయం, తవణంపల్లి మండలం కాలభైరవేశ్వర స్వామి వారికి కూడా ఆయన పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పేడు మండలం, గుడిమల్లంలోని శ్రీపరశురామేశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహించారు. రుద్రాక్షాలతో ఏర్పాటు చేసిన శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

50 టన్నుల ఫలాలు, 27 టన్నుల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, తమిళనాడు నుంచి తొమ్మిది రకాల పండ్లు 50 టన్నులు, 35 రకాల పుష్పాలు 27 టన్నులు తెప్పించి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులు అలంకరణను చూసి పరవశించిపోతున్నారు. పూలు, పండ్ల తోటల్లో శివయ్య ఉన్నాడా..? అన్నంతగా ఆలయాన్ని అలంకరించారు. శుపథం మండపం వద్ద 35 అడుగల శివలింగం.. ఆ విగ్రహంలో నుంచి ఆలయంలోకి వెళ్లేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. కోట మండపం వద్ద పూలతో ఏర్పాటు చేసిన నంది శివలింగం.. ఊంజల్ మండపం వద్ద ఏర్పాటు చేసిన కన్నప్ప, శ్రీకాళహస్తీశ్వరుని ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయంలో అమ్మవారి ముందు ఏర్పాటు చేసిన మధురమీనాక్షి అమ్మవారి ప్రతిమను దర్శించి భక్తులు తరించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించారు.



ఫల, పుష్పాల అలంకరణ



వాకాడు: తూపిలిపాళెంలో సముద్ర స్నానం ఆచరిస్తున్న శివభక్తులు



గూడూరు : శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తూ..





పిచ్చాటూరు : పళ్లికొండేశ్వర స్వామి వాహన సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం, శ్రీసిటీ ఎండీ రవిసన్నారెడ్డి, పట్టు వస్త్రాలు సమర్పిస్తూ..

నేత్రపర్వంగా వెంకన్న రథోత్సవం

- నేడు చక్రస్నానంతో ముగియనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



నాలుగు మాడ వీధుల్లో రథంపై ఊరేగుతున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవం కనుల పండువగా సాగింది. కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శనివారం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా దివ్యరథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనం ఇచ్చారు. అంతకముందు ఉదయం స్వామి వారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణలతో, భక్తజన బృందాల నడుమ రథోత్సవాన్ని ప్రారభించారు. టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత రథోత్సవంలో పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వెంకన్న రాజసం

శనివారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏవీఎస్‌ఓ విశ్వనాథం, వీఐ సురేష్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది తరఫున స్వామి వారికి వివిధ రకాలైన పండ్లు, పూలను సమర్పించి, సర్కారు హారతిని అందుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు.

నేడే చక్రస్నానం

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నానం కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 9.40 నుంచి 9.50 గంటల మధ్య ఆలయ పుష్కరిణిలో వైఖానస ఆగమోక్తకంగా నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరిగే ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు



సిద్ధేశ్వరుని సేవలో మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఎర్రావారిపాళెం: తలకోన శ్రీసిద్ధేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయ కల్యాణ వేదికలో సిద్ధేశ్వరీ సమేత సిద్ధేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో ఆది దంపతులు నంది వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో రాత్రి జాగరణ, సంతానం లేని స్త్రీలు వరపడ్డారు. మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రసాదాలు స్వీకరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

అలరిస్తూ..ఆకట్టుకుంటూ..



శివలింగ ద్వారం





బొమ్మ ఏనుగులు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో వాహన సేవల ముందు వివిధ కళారూపాలు ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు. నిజ ఏనుగును తలపించేలా ప్రతిమలు ప్రదర్శించారు. కోలాటం, చెక్కభజనలు, వివిధ రకాల వాయిద్యాలతో భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ఓలలాడించారు. శివలింగం, నందిపై పరమేశ్వరుడు ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - శ్రీకాళహస్తి

శ్రీసిటీలో సంగీత గేయధార

వరదయ్యపాళెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలో శ్రీవాణి ఆధ్యాత్మిక సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ పండితుడు డాక్టర్ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధార కార్యక్రమం నిర్వహించారు. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. సంగీత సాహిత్యం ప్రధానంగా సాగిన ఈ కార్యక్రమంలో యాచేంద్ర అప్పటికప్పుడే అనువుగా రాగతాళ గేయాలను ఆలపించారు. శివపార్వతుల దాంపత్య వైశిష్ట్యాన్ని ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ సృష్టికర్త రవీంద్ర సన్నారెడ్డి సాధించిన విజయాన్ని మెచ్చుకుంటూ ఆయన తండ్రి ఇచ్చే ఆశీస్సులను గేయరూపంలో మనోహరంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో పలువురు గాయకులు, పండితులు శోభారాజ, కుసుమకుమారి, పనతుల సుబ్రమణ్యం, జేకేరెడ్డి, వెంకటరామజోగి, పల్లేటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సంగీత గేయధారలో ఆలపిస్తున్న సాయికృష్ణ యాచేంద్ర